

నేడు ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని రాక



ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు బుధవారం తాడేపల్లిగూడెంలో పర్యటించనున్నట్లు జిల్లా సమాచార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. విజయవాడ నుండి రోడ్డుమార్గంలో తాడేపల్లిగూడెం 2.30 గంటలకు చేరుకుంటారు. హార్టికల్చర్ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో సేదదీరిన అనంతరం మధ్యాహ్నం మూడు గంటల నుండి 5 గంటల వరకు డాక్టర్ వైఎస్ఆర్ మేధో వేదిక కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం సాయంత్రం 5.10 నిమిషాలకు హార్టికల్చర్ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి బస చేయనున్నట్లు పేర్కొన్నారు. ఐదో తేదీ ఉదయం 10.20 గంటలకు తాడేపల్లిగూడెం నుండి రోడ్డు మార్గాన బయలుదేరి అమలాపురం వెళ్తారని తెలిపారు.

హమాలీ ఛార్జీలేవీ..!



రబీ ధాన్యానికి సంబంధించి ఇప్పటికీ రాని హమాలీ ఛార్జీలు

క్వింటాకు రూ.25 చొప్పున రావాల్సి ఉన్నా పట్టించుకోని అధికారులు

గత ఖరీఫ్‌లోనూ పలువురు రైతులకు అందని హమాలీ సొమ్ము

బాధితుల్లో అత్యధికం కౌలురైతులే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం పండించే రైతుల గోడు ప్రభుత్వానికి, అధికారులకు పట్టడం లేదు. ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ప్రభుత్వం ప్రకటించిన హామాలీ ఛార్జీలు సైతం ఇప్పటికీ అందని దుస్థితి నెలకొంది. రైతుభరోసా కేంద్రాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే నాధుడే లేకుండాపోయాడు. ఏలూరు జిల్లాలో హమాలీ సొమ్ము అందని బాధిత రైతులు అత్యధికంగా ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. గడిచిన రబీలో ఏలూరు జిల్లావ్యాప్తంగా 2.16 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. 31,999 మంది రైతుల నుంచి రూ.442 కోట్లు విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇది రైతులకు పెనుశాపంగా మారింది. లారీలు, సంచులు దొరక్కపోవడం, మిల్లర్లకు అదనపు సొమ్ము చెల్లించాల్సి రావడం వంటి సమస్యలు అన్నదాతను తీవ్రంగా వేధిస్తున్నాయి. దీంతో రైతులే వాహనాలను మాట్లాడుకుని ధాన్యం తరలిస్తున్నారు. లారీ కిరాయి సొమ్ము, ధాన్యం పట్టే జట్టుకు సంబంధించి హమాలీల సొమ్మును రైతులకు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పింది. క్వింటాకు రూ.25 చొప్పున హమాలీ సొమ్ము చెల్లించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. క్షేత్రస్థాయిలో హామాలీ ఛార్జీలు క్వింటా ధాన్యం పట్టేందుకు రూ.30, రూ.35 వరకూ ఖర్చవుతోంది. అయినప్పటికీ ఎంతోకొంత వస్తుందిలే అని రైతులు సర్దుకుంటున్నారు. ఆ సొమ్ము సైతం సరిగా రైతులకు ఇవ్వని దుస్థితి నెలకొంది. గడిచిన రబీ ధాన్యానికి సంబంధించిన హమాలీల సొమ్ము ఇప్పటికీ అందకపోవడంతో రైతులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. బాధిత రైతుల్లో అత్యధికం కౌలురైతులే ఉన్నారు. రవాణా ఛార్జీలు కూడా జమ కాలేదని పలువురు రైతులు చెబుతున్నారు. గడిచిన ఏడాది ఖరీఫ్‌లోనూ చాలామంది రైతులకు హమాలీ ఛార్జీలు అందని పరిస్థితి ఉంది. ప్రతిరైతుకూ న్యాయం చేస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు సంబంధం లేకుండాపోయింది. ప్రభుత్వం నుంచి హమాలీ ఛార్జీలు అందకపోవడంతో రైతులే తమ సొంత సొమ్ము హమాలీలకు చెల్లించాల్సి వచ్చింది. దీంతో రైతుల నెత్తిపై మరో అదనపు భారం పడినట్లయ్యింది. హమాలీ ఛార్జీలపై పౌర సరఫరాల శాఖ ఏలూరు జిల్లా మేనేజర్ మంజుభార్గవిని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

హమాలీ ఛార్జీలు రూ.8 వేలు రావాలి

బైరెడ్డి లక్ష్మణరావు, సుంకరవారితోట, వరిరైతు

రబీలో పదెకరాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాం. దాదాపు రూ.ఎనిమిది వేల వరకూ హమాలీ ఛార్జీలు రావాలి. ఇప్పటి వరకూ బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. రైతుభరోసా కేంద్రాల్లోని అధికారుల వద్దకు వెళ్తే వచ్చేస్తాయని చెప్పడం తప్ప ఇప్పటికీ రాలేదు. దీంతో చేతి సొమ్ము హమాలీలకు చెల్లించాల్సి వచ్చింది. ఇప్పటికైనా హమాలీ ఛార్జీల సొమ్ము జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

40 ఎకరాల ధాన్యానికి హమాలీ ఛార్జీలు జమ కాలేదు

సున్నా వెంకట్రావు, ఉండ్రాజవరం, దెందులూరు మండలం

రబీలో 40 ఎకరాల్లో వరిసాగు చేశాను. దాదాపు నాలుగు వేల సార్ల ధాన్యం విక్రయించాం. సారకు హామాలీ ఛార్జీ కింద రూ.15కు పైగా ఖర్చయ్యింది. ప్రభుత్వం సారకు రూ.పది చొప్పున ఇస్తామని చెప్పింది. ఈ సొమ్ము సైతం ఇప్పటి వరకూ రాలేదు. గడిచిన ఖరీఫ్ సీజన్‌లోనూ హమాలీ ఛార్జీలు అందలేదు. హమాలీ ఛార్జీలు అందేవిధంగా చూడాలని కోరుతున్నాం.

హమాలీ ఛార్జీల బకాయిలు వెంటనే చెల్లించాలి

కె.శ్రీనివాస్, ఎపి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

గడిచిన ఖరీఫ్, రబీలకు సంబంధించి అనేక మంది రైతులకు ఇప్పటికీ హమాలీ ఛార్జీలు అందలేదు. ఈ సొమ్ము కోసం చాలామంది రైతులు ఎదురుచూస్తున్నారు. ఏ రైతు పేరు మీద ధాన్యం విక్రయించారో ఆ రైతు ఖాతాల్లో పడతాయని చెబుతున్నారేగానీ జమ కావడం లేదు. దీనికి సంబంధించిన సమాచారం ఆర్‌బికెల్లోనూ చెప్పడం లేదు. పలుచోట్ల రవాణా ఛార్జీల సమస్య కూడా ఉంది. వెంటనే బకాయిలను చెల్లించకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతాం.



భీమవరం ప్రకాశంచౌక్‌లో నిరసన తెలుపుతున్న నేతలు



తణుకులో నిరసన తెలుపుతున్న నేతలు

మోడీ మూల్యం చెల్లించక తప్పదు

సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రధాని మోడీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి రైతుల మృతికి కారకులైన మంత్రిని పదవి నుండి తొలగించకపోతే రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల బ్లాక్‌డే పిలుపులో భాగంగా భీమవరంలో ప్రదర్శన, నల్ల జెండాలతో నిరసన మంగళవారం చేపట్టారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుండి ప్రకాశం చౌక్ వరకు నల్లజెండాలతో ప్రదర్శన నిర్వహించి అక్కడ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షత వహించగా అఖిలభారత అగ్రగామిక కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు లంకా కృష్ణమూర్తి, ఎఐటియుసి జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. 2021 అక్టోబర్ 3న లఖింపూర్‌లో శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులపైకి దుర్మార్గంగా కారుతో దూసుకెళ్లి తొక్కించి చంపిన ఆశీస్‌మిశ్రా బయట తిరుగుతూ ఉంటే నాడు పెట్టిన తప్పుడు కేసులపై రైతులు కోర్టుల చుట్టూ తిరిగే దుస్థితి ఉందన్నారు. కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, టియుసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి దండు శ్రీనివాసరాజు, పిపిఎస్ఎస్ జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, రైతుసంఘం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతుల పోరాటంతో మూడు నల్ల చట్టాలు రద్దు చేస్తానని చెప్పిన మోడీ నేటికీ హామీలు అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. ఇప్పటికైనా రైతులపై పెట్టిన తప్పుడు కేసులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్, బంగారు వరలక్ష్మి, డి.నాగు, డి.త్రిమూర్తులు, ఎం.మునియ్య, కె.సూరిబాబు, బాబూరావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీరవాసరం: లఖింపూర్‌లో నలుగురు రైతులు, ఇద్దరు జర్నలిస్టుల మృతికి కారణమైన కేంద్ర మంత్రి అజయ్‌మిశ్రా కుమారుడు ఆశీష్‌మిశ్రాను ఇంతవరకు అరెస్టు చేయకపోవడాన్ని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి ఖండించారు. నాటి ఘటనను పురస్కరించుకుని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బ్లాక్‌డే పాటించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎం.ఆంజనేయులు, పోతుల మృత్యుంజయ, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, బొర్రా ఆలమహారాజు, బొక్కా కూర్మారావు, కేతా జ్యోతిబసు, పాలా కోటేశ్వరరావు, తాళ్లూరి రాము, మైగాపుల త్రిమూర్తులు, యాళ్లబండి నారాయణమూర్తి, అయినపూడి బాబూరావు పాల్గొన్నారు.

పెనుమంట్ర: బ్లాక్‌డేను బ్రాహ్మణచెరువు సెంటర్లో ఎపి రైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘం, సిఐటియు, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడగా కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, వివిధ సంఘాల నేతలు మేడపాటి సుబ్బారావు, గంటి ఆంజనేయులు, చింతపల్లి లక్ష్మీకుమారి, చదలవాడ బుల్లబులు, తెన్నేటి ఆంజనేయులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉండి: కేంద్ర సహాయ మంత్రి అజయ్ మిశ్రాను పదవి నుండి బర్తరఫ్ చేయాలని, ఆయన కుమారుడు ఆశిష్‌మిశ్రాను తక్షణమే అరెస్టు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఉండి ప్రధాన సెంటర్లో సిఐటియు, ఎఐటియుసి, రైతుసంఘం ఆధ్వర్యంలో బ్లాక్‌డే నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ధనికొండ శ్రీనివాస్, కలిశెట్టి వెంకట్రావు, కిలారి తవిటినాయుడు, వీరవల్లి త్రిమూర్తులు, సనపల శ్రీనివాస్, చీరల శేషు, నిమ్మితి కిషోర్, కాల్వ ఏసు, మజ్జి నాగేశ్వరరావు, రామకూరి వెంకటరత్నం, మాదాసి గోపి, నక్కా వెంకటేశ్వర్లు, బొర్రా త్రిమూర్తులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఇటుకలగుంటలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, సిఐటియు ఆధ్వర్యంలో బ్లాక్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు కండెల్లి సోమరాజు, పాలుపూరి సత్యనారాయణ మాట్లాడగా పాశం చినపెద్దిరాజు, పాల్నూరి సత్యవతి, వెంకాయమ్మ, ఎం.శ్రీను, మాగంటి చింతారావు, కొండపల్లి శిరీష, పి.సత్యవతి, పి.శ్రీను, పి.నాగమణి, పి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

పెంటపాడు: స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడారు. కార్యక్రమంలో తేతలి నాగిరెడ్డి, మాదాసు శ్రీను, కరక వెంకట్రావు, కవల రామకృష్ణ, కర్రి జనార్దన్‌రెడ్డి, కె.నాగేశ్వరరావు, మీసాల శ్రీనివాసు, గంటా కోటి, దత్తు రాము, సిరపు గణేష్, సత్య రామకృష్ణారెడ్డి, కర్రి విజయరెడ్డి, మద్దాల



తాడేపల్లిగూడెంలో..

మహంకాళి, రామకృష్ణ, తాడి గోవిందు, తిరుమల గంగరాజు, తేర్లి రాజేష్, బర్ల వంశీ పాల్గొన్నారు.

తణుకు రూరల్: రైతులు, జర్నలిస్టుల మృతి కారకుడైన అజయ్ కుమార్ మిశ్రాను కేంద్ర మంత్రివర్గం నుండి వెంటనే తొలగించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, ఎఐటియుసి జిల్లా నాయకులు బొద్దాని నాగరాజు, ఐఎన్‌టియుసి నాయకులు డి.రామకృష్ణ, ఐఎన్‌టియుసి నాయకులు తాతపూడి మారుతీరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బళ్ల చినవీరభద్రం డిమాండ్ చేశారు. మంగళవారం నరేంద్ర సెంటర్‌లో నల్ల జెండాలు, నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో గార రంగారావు, అడ్డగర్ల అజయకుమారి, గుబ్బల గోపి, పుట్ట అమ్మిరాజు, తమరాపు పల్లపురావు, మల్లిన రాధాకృష్ణ, కె.సత్తిబాబు, కొమ్మారెడ్డి ప్రభాకరరావు, ఎం.గోవిందరాజు, శివ, రామకృష్ణ, ఎన్.ఆదినారాయణ బాబు, అయ్యప్ప పాల్గొన్నారు.

పాలకోడేరు: శృంగవృక్షం, విస్సాకోడేరు గ్రామాల్లో రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శేషపు అశ్రియ్య మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కలిదిండి గోపాలరాజు, కె.వెంకన్న, సూర్యారావు, వెంకటేశ్వరరావు, కొటికలపూడి శ్రీను, సూర్యనారాయణ, ఆనందం పాల్గొన్నారు.

గణపవరం: పిప్పర సెంటర్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం అధ్యక్షులు మెంటే సూర్యారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో రైతుసంఘం మండల కార్యదర్శి గుత్తుల శ్రీను, సిఐటియు మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి మాట్లాడారు. నేతలు పి.సుబ్రహ్మణ్యం, చెన్నం నాగేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యలమంచిలి: రైతుసంఘం, కౌలురైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కానేటి బాలరాజు, దేవ సుధాకర్, యడ్ల మోహన్‌రావు, ఏసోబు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆకివీడు: నలరైతు చట్టాలను పార్లమెంటు సాక్షిగా రద్దు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మంగళవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బి.రాంబాబు, నక్కాని సత్యనారాయణ, నాగరాజు, బర్నాల అప్పలనాయుడు, ఆదినారాయణ, సత్యం, అచ్చయ్య పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల పిలుపులో భాగంగా సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుండి పోలీసు ఐలాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసు ఐలాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ రైతాంగ ఉద్యమ సందర్భంగా మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, నరమాల కృష్ణ, మడక రాజు, గొర్రెల వంశీ, కాలపురెడ్డి కొండలరావు, పతివాడ నాగేంద్రబాబు, గంటల అప్పారావు, ఏపూరి శ్రీను పాల్గొన్నారు.

మొగల్తూరు: ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్లో బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యడ్ల చిట్టిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో కొత్త విజయకుమార్, బంగారు వెంకట సీతారామయ్య, మల్లిపూడి బుల్లయ్య, బజార్ జట్టు కార్మికులు, స్నేహ ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: అంబేద్కర్ సెంటర్‌లో బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పెద్దిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘాల నేతలు ముచ్చర్ల త్రిమూర్తులు, పొన్నాడ రాము, గుత్తుల శ్రీరామచంద్రుడు, వెన్నా సింహాచలం, కుక్కల శ్రీరామ్మూర్తి, గుబ్బల నాగేశ్వరరావు, పిల్లి కామేశ్వరరావు, జల్లి రామ్మోహన్‌రావు, వాటాల ధనుంజయ పాల్గొన్నారు.



ఉండిలో..



నరసాపురంలో..

సామాజిక అణచివేతపై పోరు ఉధృతం

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు - ఘనంగా కెవిపిఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం

సామాజిక అసమాన తలపై రాజీలేని పోరుకు కెవిపిఎస్ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. కెవిపిఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక అంబేద్కర్ చౌక్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆత్మగౌరవం, సమానత్వం, కులనిర్మూలన లక్ష్యాలతో కూడిన కెవిపిఎస్ నీలి జెండాను క్రాంతిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధనకు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం 1998 అక్టోబర్ 2న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ దళితుల పట్ల సామాజిక వివక్ష కొనసాగుతుందన్నారు. దళితులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినా సామాజికంగా అసమానతలను నేటికీ ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చాక దళితుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి బాబు

రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి దానిస్థానంలో ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేస్తున్నారని విమర్శించారు. దళితులపై నేటికీ దాడులు మరింత పెరిగాయన్నారు. రక్షణ చట్టంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని మార్పు చేసి దళితులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. దళితుల అభ్యున్నతి కోసం పేరుతో ఎన్ని జిఒలు తీసుకొచ్చినా అవి కాగితాలకే తప్ప అమలుకు నోచుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేసి ప్రతి దళిత కుటుంబానికీ రెండెకరాల భూమిని కేటాయించాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సామాజిక సంఘాలను ఐక్యం చేసి కుల నిర్మూలనకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. మనువాద మతోన్మాదులు చేసే కుట్రలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు కె.బాలస్వామి, రాజు, ప్రసాద్, ఆనంద్‌బాబు, లక్ష్మయ్య, కేశవరావు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటర్ల జాబితా సవరణ పక్కాగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. విజయవాడలోని ఎన్నికల సంఘం ప్రధానాధికారి కార్యాలయం నుండి మంగళవారం ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా, రాజకీయ పార్టీలు సమర్పించిన క్లెయిములు, అభ్యంతరాలు, అనోమలీస్, చనిపోయిన, డూప్లికేట్, బదిలీ చేయబడిన, నకిలీ ఓటర్ల జాబితాల వెరిఫికేషన్, ఎపిక్ కార్డ్ జనరేషన్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుండి కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి అనర్హుల ఓటర్లకు సంబంధించి అందిన ఫిర్యాదుల పరిశీలన పూర్తి చేశామని వివరించారు. అలాగే ఫారం-6, 7, 8లకు సంబంధించి ఎలాంటి పెండింగ్ లేకుండా పరిశీలనను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటింటి సర్వే పూర్తిస్థాయిలో భాగంగా షిఫ్టెడ్, అనోమలీస్, జంక్ క్యారెక్టర్స్‌కు సంబంధించి పరిశీలన చేస్తున్నామన్నారు. పెండింగ్ ఉన్న వాటి పరిశీలన త్వరితగతిన చేపడతామని వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎపిక్ కార్డుల జనరేషన్ చేపట్టామన్నారు. జిల్లాకు కొత్తగా ఇవిఎంలు వచ్చాయని, వాటికి సంబంధించి స్కానింగ్ ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. యాక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్స్ (ఏటిపి) ఆఫ్ ఇవిఎంలో భాగంగా బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఇంజినీర్లు ఇవిఎంలను పరిశీలించారన్నారు. వివిప్యాట్స్‌ను కూడా ఇంజినీర్లు పరిశీలిస్తారన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు ఎప్పటికప్పుడు అన్ని వివరాలనూ తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కె.సంగీత్ మాధుర్, భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, నియోజకవర్గాల ఇఆర్‌ఒలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, వైద్యంతోనే అభివృద్ధి సాధ్యం

బాలికల వసతి గృహాన్ని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - ఆచంట

విద్య, వైద్యంతోనే అభివృద్ధి సాధ్యమని, వేల కోట్లు కేటాయించి అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంగళవారం ఆచంటలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలికల వసతి గృహాన్ని, రూ.20 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.15 లక్షలతో గ్రామ పంచాయతీ భవనాలను రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు పిల్లి.సుభాష్ చంద్రబోస్, శాసన మండలి సభ్యులు కుడిపూడి సూర్యనారాయణ, వంకా రవీంద్రనాథ్, తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులు మేకా శేషుబాబు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్‌పి ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీతో కలిసి శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ విప్లవాత్మకమైన మార్పులకు దేశానికి రాష్ట్రం దిక్సూచిలా నిలుస్తోందన్నారు. నియోజకవర్గంలో ఒక రోజులో రూ.7 కోట్ల 53 లక్షలు అభివృద్ధి కార్యక్రమాలు జరపడం ముఖ్యమంత్రి ఘనతకు నిదర్శనమన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాలు మన రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. సచివాలయం, గ్రామ వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి వినూత్న పాలనకు శ్రీకారం చుట్టారన్నారు.



బాలికల వసతిగృహాన్ని ప్రారంభించిన వైసిపి మంత్రులు

రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలను అమలు చేస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు కుడిపూడి సూర్య నారాయణ, వంకా రవీంద్రనాథ్, టిటిడి సభ్యులు మేకా శేషుబాబు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్‌పి ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, రాజమండ్రి రూడా ఛైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి పాల్గొన్నారు.

ప్రజోపయోగంగా జగనన్న ఆరోగ్య సురక్ష : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజోపయోగంగా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ నుంచి మంగళవారం కలెక్టర్ పి.ప్రశాంతి ఎన్నికలు, నాడు-నేడు, హౌసింగ్, జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం, ప్రాధాన్యత భవనాలు, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై సంబంధిత మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి మున్సిపాల్టీ పరిధిలో క్లస్టర్ల వారీగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ప్రజల రద్దీ పెరగడం పట్ల స్పెషలిస్ట్ డాక్టర్లు ఇబ్బందిని గుర్తిస్తే షెడ్యూల్ మార్పులు చేసి సంబంధిత ప్రతిపాదనలు కార్యాలయానికి పంపాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యసేవలు ప్రతిఒక్కరూ పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్

కేంద్రాల్లో అన్ని వసతులూ ఉండే విధంగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నుండి వచ్చిన నిబంధనల ప్రకారం ఎనోమలీస్ డిస్పోజ్ చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి కచ్చితమైన రిపోర్టులను అప్డేట్ చేయాలన్నారు. పనులు త్వరగా పూర్తిచేసి మెరుగైన ఫలితాలు చూపాలని ఆదేశించారు. స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ అప్పారావు, డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, గృహనిర్మాణ శాఖ పీడీ డాక్టర్ ఆర్‌సి.ఆనందకుమార్, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖాధికారి శ్రీనివాసరావు, ఐసిడిఎస్ అధికారి బి.సుజాతరాణి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కీర్తి పాల్గొన్నారు.


అభివృద్ధి భవనాలను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ, ఎంపీలు, ఎంఎల్‌సిలు

ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పలు గ్రామాల్లో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆధ్వర్యంలో రూ.7.52 కోట్లతో నిర్మించిన అభివృద్ధి భవనాలను రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఉమ్మడి జిల్లా జెడ్‌పి ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీ, ఎంఎల్‌సిలు కుడిపూడి సూర్యనారాయణ, వంకా రవీంద్రనాథ్ ప్రారంభోత్సవాలు చేశారు. ఆలమూరులో నిర్మించిన హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. కొయ్యేటిపాడులో హెల్త్ క్లినిక్ సెంటర్, సీసీ రోడ్డు, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. అలాగే సత్యవరంలో సచివాలయం, నెగ్గిపూడిలో రైతు భరోసా కేంద్రం, వెలగలేరులో డ్రెయిన్, మార్టేరులోని కోడేరు రోడ్డులో బస్సు షెల్టర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, నియోజకవర్గ పరిశీలకులు, రాజమండ్రి రూడా ఛైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి పాల్గొన్నారు.

పోడూరు : అభివృద్ధి, సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీలు పి.వి.మిథున్‌రెడ్డి, పిల్లి.సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో తూర్పుపాలెంలో సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్ ప్రారంభించి, సామాజిక భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ గంటా పద్మశ్రీ, ఎంఎల్‌సిలు కె.సూర్యనారాయణ, వంకా రవీంద్ర, గుబ్బల తమ్మయ్య పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - వీరవాసరం

గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ పలువురు గ్రామస్తులు గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. సర్పంచి చికిలే మంగతాయారు అధ్యక్షతన వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ మంగళవారం నిర్వహించారు. గ్రామంలో తాగునీటి సరఫరా సక్రమంగా లేదని వార్డు సభ్యుడు గుత్తుల కృష్ణారావు తెలిపారు. పంచాయతీ చెరువులోని చేపలను అక్రమంగా పట్టుకుపోతున్నారని వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలంటూ వీరపల్లి రాధాకృష్ణ, గుబ్బల శ్రీను, మద్దాల అప్పారావు సభలో కార్యదర్శిని నిలదీశారు. ఒకటో వార్డులో అంగన్‌వాడీకేంద్రం వెళ్లే రహదారి నడవడానికి వీల్లేకుండా ఉందని, నలభై సంవత్సరాల నుంచి తమను మనుషులుగా గుర్తించడం లేదని దేవల్ల అశోక్, బాలస్వామి, జోజి, నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న భోగేంద్రబాబు

పేదలకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

జనసేన సీసలి గ్రామ అధ్యక్షులు నూకల భోగేంద్రబాబు ఆర్థిక సహకారంతో 10 నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత నూకల భోగేంద్రబాబు మాట్లాడుతూ ప్రతి వారమూ 10 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. 10 వారాల నుంచి పేద కుటుంబాలకు సరుకులు అందిస్తున్నామన్నారు. జనసేన ఆశయాలకు అనుగుణంగా పేదలకు తన వంతు సాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటికలపూడి శివ, జన సైనికులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ అవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - వీరవాసరం

కెవిపిఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం వీరవాసరం బొంతువారిపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను కెవిపిఎస్ మండల కార్యదర్శి గొట్టుముక్కల శ్యాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయకుమార్ మాట్లాడుతూ దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధనకు కెవిపిఎస్ ఏర్పడిందన్నారు. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ దళితులు, దళిత మహిళలపై అనేక దాడులు జరుగుతున్నాయన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ దాడులు మరింత పెరిగాయన్నారు. దళితుల అభ్యున్నతికి ఎన్ని జిఒలు తీసుకొచ్చినా అవి పేపర్లకే తప్ప అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల, గిరిజనులకు ఉన్న హక్కులను పక్కదోవపట్టిస్తున్నారన్నారు. కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేసి దళిత కుటుంబాలకు రెండెకరాల భూమిని కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, బాల్లా దావీదుబాబుజీ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

జెసిఐ పాలకొల్లు రేసింగ్‌వారి ఆధ్వర్యంలో శివాలయం వద్ద అద్దేపల్లి రేపాక లక్ష్మణరావు కుమార్ల సహకారంతో మంగళవారం పేదలకు 400 దుప్పట్లు పంపిణీ చేశారు. జెసి అనూషా సహకారంతో పేదలకు రస్కుల ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెసిఐ అధ్యక్షురాలు మౌనికావలి మాట్లాడుతూ జెసిఐ తరపున ఈ ఏడాది అనేక కార్యక్రమాలు నిర్వహించామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మీనా మణిదీప్తి, కోశాధికారి కారుమూరి సబిత, కారుమూరి ప్రదీప్, హరీష్, కౌశిక్, విష్ణు, ఆనంద్, ప్రవీణ్, జానకిరామ్ పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు విగ్రహం ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్, శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజుకు కమిటీ ద్వారా వినతి పత్రాలు అందజేశామని, వారు సానుకూలంగా స్పందించారని, దీనికి ఒక కమిటీ ద్వారా నిర్మాణం చేపట్టాలని సూచించారని విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మంగళవారం తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ఈ విషయంపై ప్రయత్నాలు చేస్తున్నామని, ప్రజాప్రతినిధులు సానుకూలతతో త్వరలో విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, గంటా సుందర్ కుమార్ మాట్లాడారు.

ఇంటింటికి సంక్షేమం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వాడవాడలా అభివృద్ధి, ఇంటింటా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 29వ వార్డు ప్రకాష్‌నగర్ ఎస్‌టికాలనీలో రూ.66.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిత్యం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్నారన్నారు. గ్రామాలు, పట్టణంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామని తెలిపారు. సుమారు రూ.40 కోట్ల నిధులతో భీమవరం నియోజకవర్గంలో శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దొంగపిండి గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంఎల్‌ఎ సందర్శించి శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. వైద్య సేవలందిస్తున్న డాక్టర్లతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వాలు కార్పొరేట్ ఆసుపత్రులకు పెద్ద ఎత్తున బకాయిలు పెట్టిన సొమ్మును చెల్లించి తిరిగి ఆరోగ్యశ్రీ పథకానికి ఊపిరి పోశారని తెలిపారు. ప్రతి ప్రభుత్వాసుపత్రినీ అభివృద్ధి చేశారని తెలిపారు. గొల్లవానితిప్పలో రూ.16 లక్షల అరవై వేలతో కొత్త కాలనీలో నూతనంగా నిర్మించిన అంతర్గత జిఎస్‌బి రోడ్లను ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఇదే గ్రామంలోని వైఎస్ఆర్ కాలనీలో రూ.21.90 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

వీరవాసరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు అన్నారు. ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని మంగళవారం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ ఆలోచించని విధంగా వైసిపి ప్రభుత్వం ప్రజల గురించి ఆలోచిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సైదు శ్రీనివాస్, వైద్యులు క్రాంతి బాబు, ఎంపిడిఒ జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉండి : జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మంగళవారం పెదపుల్లేరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పివిఎల్ నరసింహరాజు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అవసరమైన విద్య, వైద్యంపై వేల కోట్లు వెచ్చిస్తోందని, ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులకు అవసరమైన


వడ్డిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు

పోషకాహారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెదపుల్లేరు గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు, చిన్నపుల్లేరు గ్రామ సర్పంచి పెన్మెత్స సావిత్రమ్మ రామరాజు, ఎంపిటిసి రాయి రావులమ్మ, ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆచంట : ప్రతి పేదవారికి మేమున్నామనే భరోసా కల్పించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పెదమల్లం సర్పంచి దిరిశాల విజయలక్ష్మి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఇంటినీ, ప్రతి కుటుంబాన్నీ జల్లెడ పట్టి ప్రతి ఇంటి గడప వద్దనే ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి ఒక్క రూపాయి కూడా భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. ఈ శిబిరంలో సుమారు 215 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంపూర్ణ పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వర్మ, కిషోర్, శివరంజని, సత్యవతి, వేణు, పంచాయతీ కార్యదర్శి డి.నాని పాల్గొన్నారు.

పాలకోడేరు : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఎంతో రక్షణగా నిలుస్తుందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. పాలకోడేరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉపసర్పంచి దెందుకూరి వెంకటరాజు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచి ఇంకేటి మరియమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పివిఎల్ నరసింహరాజుతోపాటు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం వైద్య సిబ్బంది ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ప్రారంభించి సందర్శించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా ప్రాజెక్టు అధికారి సుగుణరాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉండి ఎఎంసి ఛైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపిటిసి నాగలక్ష్మి, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు భూపతి రాజు వంశీకృష్ణంరాజు, విస్సాకోడేరు సొసైటీ అధ్యక్షులు జోషి పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేస్తున్నామని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. జగన్నాథపురంలో జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన మధుమేహ పరీక్ష చేయించుకున్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, ఎంపిటిసి మంతెన సూర్యనారాయణ రాజు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : ఆగర్తిపాలెంలో సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొని వ్యాధులను న్యాయం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కావలి లక్ష్మీకుమారి, మైకేల్ రాజు, వైస్ ఎంపిపి పి.సునీల్‌బాబు, ఎంపిడిఒ సంఘాని వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.


పాలకోడేరులో పరీక్షలు చేయించుకుంటున్న పివిఎల్

టైలర్లందరికీ జగన్న చేదోడు అమలు చేయాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరుతో అమలు చేస్తున్న జగనన్న చేదోడు పథకాన్ని ఎటువంటి నిబంధనలు పెట్టకుండా టైలర్లందరికీ అమలు చేయాలని వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం గౌరవాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. కుట్టుమిషన్ రూపకర్త ఇలియాస్ వోవే వర్ధంతి సందర్భంగా వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో సాలిపేటలోని ఇలియాస్ వోవే విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి టైలర్‌కూ రూ.10 వేలు చొప్పున మంజూరు చేయడం వల్ల ఇబ్బందుల్లో ఉన్న టైలర్స్‌కు కొంతమేర ఉపశమనం కలుగుతుందని తెలిపారు. అయితే చేదోడు అమల్లో మొదటి విడత నుంచి ఇప్పటివరకూ చాలా మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి షాపుతో సంబంధం లేకుండా ఎటువంటి నిబంధనలు పెట్టకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి టైలర్‌కూ రూ.10 వేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరపు నాగరాజు, వాసా వెంకటేశ్వరరావు, కుడకా వీరభద్రరావు, కోటిచుక్కల నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.


ఇలియాస్ వోవే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

పోషకాహార ప్రదర్శన

వీరవాసరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంటుంది. ఈ ప్రదర్శనలో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, తల్లులకు, కిశోర బాలికలకు అవసరమైన పోషకాహార ప్రదర్శన పలువురిని ఆలోచింపజేసే విధంగా ఉంటుంది. పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి ఈ ప్రదర్శన ద్వారా అంగన్‌వాడీ సిబ్బంది స్థానికులకు అవగాహన కలిగించారు. ఈ వైద్య శిబిరం వద్దకు వచ్చే ప్రతి ఒక్కరికీ అంగన్‌వాడీలు పోషకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ లక్ష్మీకాంతం, సూపర్‌వైజర్ కనకమహాలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది బేబి సరోజనీ, వరలక్ష్మీ, శాంత కుమారి, మంగ, విజయకుమారి పాల్గొన్నారు.

నూతన యూత్ పాలసీని ప్రకటించాలి

తణుకు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతన యూత్ పాలసీని వెంటనే ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ నెల 4న సిపిఎం ఆధ్వర్యంలో రాజమండ్రి రివర్ బే వద్ద ఉదయం 10 గంటలకు నిరుద్యోగ సమస్య పరిష్కారం ప్రత్యామ్నాయ విధానాలతో' జరిగే సదస్సును విజయవంతం చేయాలని సిపిఎం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం స్థానిక నరేంద్ర సెంటర్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, 40 వేలతో మెగా డిఎస్‌సి వేయాలని డిమాండ్ చేశారు. సిఎంఐఇ శాంపిల్ సర్వే ప్రకారం ఐదు కోట్ల మందికి తక్షణం ఉపాధి కల్పించాలని, లేకపోతే తీవ్ర సంక్షోభం వస్తుందని చెప్పిందని తెలిపారు. కేంద్రంలో 9.64, రాష్ట్రంలో 2.35 లక్షలు ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఒక డిఎస్‌సి పోస్టు కూడా తీయని ప్రభుత్వం వైసిపి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అజయకుమారి, గుబ్బల గోపి, ఎన్.చిన్నారావు, శివ, గార రంగారావు, బళ్ల చిన వీరభద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నింటా విజయం సాధించాలి

ఎస్ఆర్‌కెఆర్ డైరెక్టర్ జగపతి రాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులు విద్యతో పాటు కళ, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో విజయాలు అందిపుచ్చుకోవాలని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాల ఇసిఇ విద్యార్థి కె.పాండు కళాశాలలో నిర్మించిన మహస్సు షార్ట్ ఫిల్మ్‌కు జాతీయస్థాయిలో నాలుగు అవార్డులు సొంతం చేసుకున్న సందర్భంగా షార్ట్ ఫిల్మ్ హీరో పాండును, ఆయన బృందాన్ని మంగళవారం కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా షార్ట్ ఫిల్మ్ హీరో పాండు మాట్లాడుతూ మహస్సు షార్ట్ ఫిల్మ్‌లో తాను బెస్ట్ యాక్టర్స్ విభాగంలో మూడో స్థానంలో, హీరోయిన్ జై.లోకేశ్వరి బెస్ట్ యాక్టర్స్ విభాగంలో రెండో స్థానంలో అవార్డులు అందుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా బెస్ట్ సినిమాటోగ్రఫీ, బెస్ట్ క్రైమ్ థ్రిల్లర్ స్టోరీ అవార్డులను కూడా సొంతం చేసుకున్నామని తెలిపారు. ఈ షార్ట్ ఫిల్మ్‌తో తనకు ఇతర చిత్రాల్లో దర్శక విభాగంలో, నటనా విభాగంలో నటించే అవకాశం లభించిందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మురళీకష్ణంరాజు షార్ట్ ఫిల్మ్‌లో నటించిన విద్యార్థులు శ్రీరామ్, సాయిరాంను అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ కళాశాలలో ఫిల్మ్ క్లబ్ కూడా ఏర్పాటు చేశామన్నారు

టిడిపి వినూత్న నిరసనలు

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం ఉండిలో ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో 20వ రోజు పితాని సత్యనారాయణ పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ, ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అరెస్టు వెనుక బిజెపి నేతల హస్తం ఉన్నట్లు ప్రజల నుంచే అనూహ్యంగా ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై బిజెపి నేతలే సమాధానం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు వత్సవాయి సుజాత పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ చంద్రబాబును అరెస్టు చేయడంతో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలను విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్న మంత్రుల నోళ్లను అదుపులో పెట్టుకోవాలన్నారు. నిరాహార దీక్ష శిబిరం వద్ద టిడిపి నాయకులు అవినీతికి అధికారం నీతికి ఉరికంభం అంటూ విన్నూతరీతిలో ఉరి వేసుకుని నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, ఆచంట జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు పాల్గొన్నారు.


మొగల్తూరులో నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

పాలకొల్లు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద 21వ రోజు మంగళవారం దీక్షలు కొనసాగాయి. దీక్షల్లో ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ముస్లిములతో పాటు పాల్గొని చంద్రబాబు త్వరగా ప్రజాజీవితంలోకి అడుగు పెట్టాలని అల్లాను ప్రార్థించారు. టిడిపి జిల్లా మైనార్టీ సెల్ మాజీ ఛైర్మన్ మహమ్మద్ జానీ మాట్లాడారు.

ఆచంట : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 21వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి పితాని మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ దీక్షలకు పితాని సత్యనారాయణతో పాటు, రొబ్బు సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షులు బైరెత్తి వెంకటకృష్ణ, నెక్కంటి ప్రభాకర్ పాల్గొన్నారు.

మొగల్తూరు : చంద్రబాబుపై వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దారుణమని టిడిపి నాయకులు విమర్శించారు. ముత్యాలపల్లిలో టిడిపి నాయకులు మానవహారం చేసి నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, పెంటయ్య, నాగేశ్వరరావు, మూలస్వామి పాల్గొన్నారు.

In the Court of Hon'ble 1st Addl. District Judge at Eluru
O.S. No. 35/2020

Between:
Mallavolu Satyanarayana, Being Unsound Mind Rep. by its Guardian the elder son Mallavolu Vasu & Others ***..Plaintiffs***
AND
Mallavolu Nancharamma & Others ***...Defendants***

TO: D-8: Pithani Krupamani, W/o. Veera Raju, D/o. Chintapalli Venkateswara Rao, R/o. D.No. 6C-12-9, Dakshinapu Veedhi, Venkanna Cheruvu, Eluu Rural (M), W.G.Dist.

పై నెంబరు దావా గ్రంధములో శ్రీ కోర్టు వారు 8వ ప్రతివాది హాజరు నిమిత్తం పలుమార్లు సమన్లు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీయొక్క హాజరు నిమిత్తం **ది.09-11-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు వాయిదా వేసియున్నారు.** కావున మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాని ఎడల మీ పరోక్షమున పై నెంబరు దావా గ్రంధము పరిష్కరించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
Y.V.RAMA KRISHNA
Advocate, Eluru.
Cell: 77991 65999


రమేష్ రాజు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న అభిమానులు

అన్నదానం గొప్పది

ఉండి: దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని సన్‌రైజ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు వాణి అన్నారు. మంగళవారం వైసిపి సీనియర్ నాయకులు కొత్తపల్లి రమేష్‌రాజు పుట్టినరోజు వేడుకలు మహాదేవపట్నంలోని సన్‌రైజ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు వేడుకలను వృద్ధాశ్రమాల్లో నిర్వహించడం వల్ల వృద్ధులకు కడుపునిండా అన్నం పెట్టిన వారవుతారని సూచించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రమేష్‌రాజు, అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తణుకురూరల్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎపిటిఎఫ్ శాఖ తణుకు జోనల్ సమావేశం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా శాఖ ఉపాధ్యక్షులు ఎ.వీరభద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా శాఖ కార్యదర్శి వి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ఎంఇఒ పోస్టులు మంజూరు చేయాలని, ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టాలని, దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉద్యోగుల జిపిఎఫ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి ఎన్.జయరాజు మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో కె.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాలో పలు చోట్ల వర్షం

మొగల్తూరు: మండలంలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. ఉదయం నుండి సాయంత్రం వరకూ ఎండ తీవ్రతతో అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో ప్రజలు అల్లాడారు. సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

పాలకొల్లు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో పట్టణంలో మంగళవారం సాయంత్రం తేలికపాటి వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడింది. పక్షం రోజులుగా తీవ్ర ఉష్ణోగ్రతలతో సతమవుతున్న నేపథ్యంలో వాతావరణం మారి చల్లబడడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి :: ఏలూరు
Transfer O.P.No. 42/2022

బిట్వీన్:
1) శ్రీ ఇంజవరపు నాగేంద్ర కుమార్
2) శ్రీ ఇంజవరపు కృష్ణవేణి
...పిటీషనర్లు /వాదులు
మరియు
1) సాలి వెంకటేశ్వరరావు
2) కంచర్ల శ్రీను
...రెస్పాండెంట్లు /ప్రతివాదులు

శ్రీ సాలి వెంకటేశ్వరరావు మరియు వగైరా

పై నెంబరు పిటీషనులో 1వ ప్రతివాది అయిన శ్రీ సాలి వెంకటేశ్వరరావు, తండ్రి: పాపాయ్య, వ్యవసాయం, R/o. డో.నెం. 12-83, ముక్కంపాడు, ప్రగడవరం గ్రామం, చింతలపూడి మండలం అనువారికి నోటీసులు అమలు కొరకు **ది.05-10-2023వ తేదీకి వాయిదా ఉన్నది. సదరు వాయిదా రోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోగలరు.** లేని ఎడల వారి పరోక్షమందు పిటీషను సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఇ.శ్రీనివాసబాబు
అడ్వకేట్స్, ఏలూరు.
ఏలూరు, 03-1023.
ఫోన్: 08812 239498

In the Court of the VIIth Addl. District Judge, Eluru
A.S. No. 94/2018

Between:
Ammireddy Tirumala Reddy ***...Appellant***
AND
Kantepuneni Venkata Arun Kumar and Others ***...Respondents***

R-2: Vegunta Srinivasa Rao, S/o. late Purnachandra Rao, Hindu, Male, aged about 42 years, Business, R/o. D.No. 1-26, Appanaveedu Village, Pedapadu Mandal, W.G.Dt., Eluru JCJC.
R-3: Vegunta Niranjan, S/o. late Purnachandra Rao, Hindu, Male, aged about 40 years, Business, R/o. D.No. 1-26, Appanaveedu Village, Pedapadu Mandal, W.G.Dt., Eluru JCJC.
R-4: Vegunta Rama Krishna Rao, S/o. late Purnachandra Rao, Hindu, Male, aged about 39 years, Business, R/o. D.No. 1-26, Appanaveedu Village, Pedapadu Mandal, W.G.Dt., Eluru JCJC.

కోర్టు ప్రకటన

పై నెంబరు గల Appeal లో Respondent 2 to 4 లకు ఎన్ని కోర్టు నోటీసులు పంపిన పుచ్చుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు Respondents 2 to 4 లకు నోటీసులు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్‌కు ఆర్డరు వేసినారు. కావున పై వారికి ఏమయిన ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు ఎదుట **ది. 18-10-2023న ఉదయం 10.30 ని॥లకు** హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.

NEKKARAGANTI NARASIMHA RAO
Advocate for Appellant
Eluru
25-9-2023
Eluru
Cell: 9848118984